# మహిమ

"చెట్టులోంచి పొగొ స్తోంది.. చెట్టులోంచి పొగొస్తోంది"

గోలగోలగా అరుస్తున్నాడో పిల్లవాడు. సాయంత్రం సరిగ్గా ఆరున్నర గంటల సమయం. రోడ్డుమీద నడిచేవాళ్లంతా పిల్లాడి గోలకు ఠక్కున ఆగి ఆ వింతేమిటో చూద్దామని చెట్టువంక చూశారు.నిజమే.. అది పొగే! అందులో ఏమాత్రం అనుమానం లేదు.

రోడ్డు నానుకొని ఒక చిన్నదేవునిగుడి. గుడి ప్రక్కనే ఓ పెద్ద రావిచెట్టు. చెట్టు పై భాగంలోంచి పొగ కనిపిస్తూ చూసేవాళ్లకు..... ఆశ్చర్యంగా వుంది! కాస్సేపటికి..సైకిళ్లూ-స్కూటర్లూ... జనంతో రద్దీ పెరిగిందక్కడ.

బాగా చీకటయింది. ఇక పొగకన్పించే అవకాశం లేదు. కొన్నినిముషాల్లోనే ఆ వింత వార్త పట్టణమంతా వ్యాపించింది. ఎవరినోట విన్నా- పొగ గురించే!

"కాలమహిమ కాకుంటే చెట్టులోంచి పొగ రావడమేమిటి? ప్రపంచ వినాశనానికిదొక హేతువై వుంటుంది! " అన్నాడో పండితుడు.

'కరువూ కాటకాలు రాబోయే ముందు.. చెట్లలోంచి పొగ లొస్తాయనీ అవి ఏడుస్తాయనీ మాతాత చెప్పుండేవాడు.' అన్నాడో బోసి తాతయ్య.

"బ్రహ్మంగారి మాటలు వట్టిగాపోవు! నిప్పు నీళ్లూ, నీళ్ళునిప్పూ అవుతాయని ఎప్పుడో చెప్పిన కాలజ్ఞానమంతా ఇలాంటిదే!" అన్నాడో భక్తుడు.

'ఇదంతా అదిగో ఆ గుడిలోదేవుడికేతెలియాలి...మనదేంలెక్క' అన్నాడో వేదాంతి!

తెల్లవారింది!



మెండా ప్రభాకరరావు

అయితే పగలంతా పొగ ఎక్కడా చెట్టుమీద కనపడ్లేదు. ఆ క్రితం రోజులాగే..బహుశ సాయంత్రం కన్పిస్తుందేమో నని జనమంతా కాచుక్కూర్చున్నారు.

ఈ సంగతి తెలిసి... ఇరుగుపొరుగు గ్రామాల వాళ్ళంతా ... ఉత్సాహంగా .. ఉరుకులూ పరుగుల్తో సైకిళ్ళూ, స్కూటర్లూ,కార్లపై కదలివచ్చారు.

ఎటు చూసినా... మిద్దెలన్నీ, మేడలన్నీ జనంతో నిండిపోయాయి.

అందరి కళ్ళూ చెట్టుమీదే, అందర్లో ఉత్సుకత! రద్దీ చూసిన ఓ కుర్రోడికి మెరుపులాంటి ఆలోచన ఒకటి తట్టింది!

వెంటనే ఖాళీ డాల్డా డబ్బానొకటి తెచ్చాడు. చెట్టు మొదటికి కట్టి... 'శాంతికోసం చందాలు వేయండ'నిఅట్టమీద పెద్దక్షరాలు వ్రాసి, చందాలు అడుక్కోవడం మొదలెట్టేడు!

సరిగ్గా సాయంత్రం ఆరున్నరకు.... ఆ క్రిందటి రోజు లాగే చెట్టుపై పొగ కనిపించింది! జనంలో సంచలనం.... ఆశ్చర్యం!

కొందరు టార్చీలు వేసి మరీ చూశారు. చీకటి పడింది! అంతా వెళ్ళిపోయారు. పత్రికల్లో వార్త లొస్తున్నాయి!

ఎవ్వరేం చెప్పినా సైన్సు విద్యార్థులకది సవాలుగా నిలిచింది!

ఫోన్ల ద్వారా సైంటిస్టులకీ వార్త అందింది! త్వరలో వారొస్తున్నట్లు తెలిసింది. ఆ రహస్యమేదో కనిపెట్టాలని విద్యార్థుల్లోపట్టుదలపెరిగింది.

మరోరోజు గడిచింది. ఒక విద్యార్థి న్యూస్ పేపరుకు రెండువైపులా గ్రీజ్ పూసి దానినో పొడవాటి కర్రకుకట్టి - చెట్టు పై కొమ్మల దాకా 'ఎక్క-క్కర' సహాయంతో ఆ పేపర్ని అన్ని వైపులకూ తిప్పి - అది పొగో కాదో తేల్చుకోవాలని అనుకున్నాడు.

అరగంట తర్వాత కాగితంతో కిందికి దిగివచ్చి - అందరికీ చూపించాడు.

అతడు తెచ్చిచ్చిన కాగితం చూసి అందరూ పగలబడి నవ్వుకోడం మొదలైంది. కాస్సేపటికి ఇక అక్కడుంటే అవమానమన్నట్లు ఎక్కడి వాళ్లక్కడ వెళ్లిపోయారు!

ఇంతకూ అసలు విషయం......

మామూలు కళ్ళకు కనిపించనంతటి నలుసుల్లాంటి దోమలు గుంపులు,గుంపులుగా పొగలా లేవడం కనిపించాయి.

ప్రతిరోజూ పగలంతా ఆకులనంటిపెట్టుకొని ...... పొద్దుగుంకేసమయంలో అవి చెట్టుపై విహరిస్తాయి! తొలకరి వానల్లో అది మామూలు!

అంతే... ఆ రహస్యాన్ని ఛేదించిన విద్యార్థిని అందరూ అభినందిస్తూంటే....

ఇదంతా ముందే తెలిసిన డాల్డా డబ్బాకుర్రాడు ఎవరూ గమనించకముందే తన చందా డబ్బుల్తో ఉడాయించాడు!